క్లుప్తంగా

'సూర్యఘర్'కు నందమూరు ఎంపిక

పెడన: సూర్యఘర్ మోడల్ గ్రామంగా తీర్చిదిద్దడానికి మండలంలోని నందమూరు గ్రామ పంచాయతీని ఎంపిక చేసినట్లు ఇన్‌ఛార్జి ఎంపీడీవో శిరీష శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామస్తులకు సూర్యఘర్‌కు సంబంధించి సోలార్ విద్యుత్‌పై అవగాహన కల్పించడం జరుగుతుందని చెప్పారు. అలాగే కేంద్ర ప్రభుత్వం కల్పించే రాయితీలను వివరించి గ్రామంలో సోలార్ వెలుగులు నింపేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వెలుగు సిబ్బందితో పాటు పంచాయతీ కార్యదర్శులు అవగాహన కల్పించాలని సూచించారు.

పెడన ఇన్‌చార్జి ఎంపీడీవోగా శిరీష

పెడన: పెడన ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న సీహెచ్ వెంకటేశ్వర్లు సెలవు పెట్టడంతో ఆయన స్థానంలో పెడన ఎంపీడీవో కార్యాలయంలో ఏవోగా విధులు నిర్వహిస్తున్న శిరీషకు ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా బాధ్యతలను అప్పగిస్తూ జెడ్పీ సీఈవో కన్నమనాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు శనివారం ఆమె బాధ్యతలు చేపట్టారు. వచ్చేనెల ఐదవ తేదీ వరకు శిరీష ఇన్‌ఛార్జిగా బాధ్యతలను నిర్వహించనున్నారు.

ఉగ్రవాదుల దాడి హేయం

మచిలీపట్నంటౌన్: జమ్మూ–కాశ్మీర్‌లో జరిగిన ఉగ్రవాదుల దాడి హేయమైన చర్య అని మచిలీపట్నం, పెడన నియోజకవర్గ క్రైస్తవ దైవసేవకుల సంఘ ప్రతినిధులు పేర్కొన్నారు. స్థానిక హైనీ చర్చిలో శనివారం జరిగిన విలేకర్ల సమావేశంలో బెరాకా మినిస్ట్రీస్ అధినేత బ్రదర్ డాక్టర్ కిరణ్‌పాల్ మాట్లాడుతూ ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. దాడికి నిరసనగా ఆదివారం సాయంత్రం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో పాస్టర్లు మేకా విజయరాజు, నాగిశెట్టి డేనియల్, జీవియర్, బట్టు శ్యామ్, మేకా దానియేల్, డేనియల్ ఎబ్నేజర్, తాతా జక్రయ్య, డేవిడ్, వంశీ, చిన్నారావు పాల్గొన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

పెడన: పట్టణంలో సహాయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 29వ తేదీ నుంచి ఉచితంగా కంప్యూటర్ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఉస్మాన్‌భాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పెడనలోని సహాయ ఫౌండేషన్ కార్యాలయంలో నిర్వహించే శిక్షణ తరగతులను పరిసర ప్రాంత విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 92488 07494, 98666 13913, 86882 35377, 92488 07494 నంబర్లను సంప్రదించాల్సిందిగా ఆయన సూచించారు.

నాగేంద్రబాబుకు నివాళి



పాపవినాశనం(ఘంటసాల): ఘంటసాల మండలం పాపవినాశనం గ్రామానికి చెందిన యువకుడు కుంపటి నాగేంద్ర బాబు(24) శుక్రవారం రాత్రి గుండెపోటుతో ఆకస్మికంగా మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు శనివారం నాగేంద్రబాబు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతుడి తండ్రి రామయ్య, కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వైఎస్సార్ సీపీ ఘంటసాల మండల అధ్యక్షుడు వేమూరి వెంకట్రావు, వైస్ ఎంపీపీ కుంపటి నాగేంద్రబాబు, అవనిగడ్డ జెడ్పీటీసీ సభ్యుడు లక్ష్మీనారాయణ, నేతలు తాతినేని వెంకట కృష్ణారావు, ఆకురాతి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ఏడు మట్టి ట్రాక్టర్లు సీజ్

పెడన: మండల పరిధిలో ఎటువంటి అనుమతులు లేకుండా మట్టి తోలుతున్న ఏడు ట్రాక్టర్లను రెవిన్యూ సిబ్బంది సీజ్ చేసినట్లు పెడన ఇంఛార్జి తహసీల్దారు కే అనిల్‌కుమార్ తెలిపారు. నడుపూరు, బల్లిపర్రు, పెడన, కాకర్లమూడి రోడ్లు వెంబడి మట్టి లోడుతో వెళ్తున్న ట్రాక్టర్లను పట్టుకుని రెవిన్యూ కార్యాలయానికి తరలించడం జరిగిందన్నారు. ఒక్కొక్క ట్రాక్టరుకు రూ. 4వేలు ఫైన్ వేసినట్లు ఆయన తెలిపారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా పారాయణం



బంటుమిల్లి: పాశ్చాపురం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ సువర్చలాంజనేయస్వామి ఆలయంలో జరుగుతున్న హనుమాన్ చాలీసా పారాయణం శనివారానికి అర్ధమండలం(20 రోజులు) దాటి 21వ రోజుకు చేరుకుంది. ఆలయ అర్చకులు రొంపిచర్ల హనుమంతాచార్యులు పర్యవేక్షణలో శ్రీరామ నవమి నుంచి ప్రారంభమైన చాలీసా పారాయణ వచ్చేనెల 22వ తేదీన హనుమత్‌జ్జయంతి వరకు దాదాపు 45 రోజులపాటు కొనసాగనుంది. ఈ కార్యక్రమం గత ఆరు సంవత్సరాలుగా జరుగుతోందని అర్చకులు తెలిపారు. ప్రతిరోజు ఉదయం ఆరు గంటలకు బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లోని పలు గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని భక్తిశ్రద్ధలతో చాలీసా పారాయణ పఠిస్తున్నారు.

స్వచ్ఛ సుందర చల్లపల్లి

- రూపురేఖలు మార్చిన స్వచ్ఛ చల్లపల్లి కార్యకర్తలు
- 3,456 రోజులుగా నిరంతరం శ్రమదానం



స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యకర్తలు



చల్లపల్లి స్వాగత బోర్డు



ఇరువైపులా చెట్లతో కూడిన చల్లపల్లి-పాగోలు రహదారి

చల్లపల్లి: సాధారణంగా తెల్లవారుజామున లేచే వారు ఆరోగ్యం కోసం నడవడానికో.. యోగా, వ్యాయామం వంటివి చేయడానికో లేస్తుంటారు. కానీ స్వచ్ఛ చల్లపల్లి కార్యకర్తలు ఊరి కోసం లేస్తారు. నిమిషం ఆలస్యమయితే ఎక్కాల్సిన ఫ్లయిట్ మిస్సవుతామేమో అన్న ఆత్రుతగా కోడి కూడా కూయక ముందే తెల్లవారుజామున నాలుగు గంటలకే చిన్నా–పెద్దా, ఆడ–మగ తేడా లేకుండా జామ్‌జామ్ అంటూ అనుకున్న చోటికి చేరుకుంటారు. యుద్ధానికి వెళుతున్న సైనికులు ఆయుధాలు ధరించినట్లుగా పలుగు, పార, చీపుర్లు చేతపట్టి తలో వైపునకు దాడికి సిద్ధమవుతారు. వీరి పలుగు, పార్ల దెబ్బలకు ఎగుడు దిగుడు నేల మొత్తం సదును కావాల్సిందే. వీరి కత్తి వేటుకు చిందర వందగా ఉన్న చెట్ల కొమ్మలు సుందరంగా మారాల్సిందే. వీరి చీపురు తాకిడికి రోడ్లపైన ఉన్న చెత్త ఓ మూలకు చేరి చివరకు చెత్త బండి ఎక్కాల్సిందే. ఎక్కడైనా చెత్త కుప్ప కనిపించిందంటే చాలు అందరూ అక్కడికి చేరిపోయి చక్కబెడతారు. మురుగు కాలువలు కంపు కొడుతున్నా... వీరికి మాత్రం ఇంపుగా ఉంటుందేమో తెలియదు గానీ కాలువలో దిగి పేరుకుపోయిన చెత్తాచెదారం, మురుగు అంతటిని పోటీపడి శుభ్రం చేస్తారు. చల్లపల్లికి ఇరువైపులా ఉన్న రహదారులకు రెండు వైపులా చెట్లు నాటి ఆయా మార్గాలను అందమైన, ఆహ్లాదకరమైన రోడ్లుగా తీర్చిదిద్దారు.

ఒక రోజు ముందుగానే ప్రణాళిక

ఉదయిస్తున్న సూర్యుని కిరణాల వెలుగులో అప్పటి వరకు వారు శుభ్రం చేసిన ప్రదేశాలు, రోడ్లు, గుంటలు, మురుగు కాలువలను చూసుకుని స్వచ్ఛ చల్లపల్లి కార్యకర్తలు పడిన శ్రమను మర్చిపోయి ఆనందంతో మురిసిపోతారు. కాళ్లు చేతులు శుభ్రం చేసుకుని అందరూ ఒక చోటికి చేరి మరుసటి రోజు ఎక్కడ కలవాలో ముందుగానే నిర్ణయించుకుని ఆ రోజు కార్యక్రమానికి ముగింపు పలుకుతారు. చలి, మంచు, వర్షం వంటివి లెక్కచేయకుండా గత 3,456 రోజులుగా నిత్యకృత్యంగా స్వచ్ఛందంగా సేవ చేస్తున్న స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యకర్తల శ్రమైక వేడుక కథ ఇది.



అద్భుతమైన పార్కులా కనిపిస్తున్న ఈ ప్రాంతం చల్లపల్లివాసుల శ్మశాన వాటిక. ఒకప్పుడు చూడాలంటేనే ఒళ్లు గగుర్పొడిచేలా ఉండే ఈ ప్రాంతానికి తరిగోపుల ప్రాంగణంగా నామకరణం చేసి ఆధునిక రీతిలో తీర్చిదిద్దారు. వర్షాకాలంలో కూడా ఎటువంటి ఇబ్బంది లేకుండా దహన కాండలు చేసుకునేలా ఏర్పాట్లు చేశారు.



ఒకప్పుడు బహిరంగంగా ఈ రోడ్డుపైనే మలవిసర్జనలు చేస్తుండటంతో ఈ దారిలో ఒక అడుగు వేసి రెండో అడుగు ఎక్కడ వేయాలో ఆలోచించి నడవాల్సిన దుస్థితి. స్వచ్ఛ చల్లపల్లి కార్యకర్తల కృషితో రోడ్డు రూపురేఖలు మారాయి. ఎక్కడెక్కడి వారో ఇక్కడికి వచ్చి సాయంకాలం సరదాగా ఆహ్లాదకరమైన గాలి పీల్చుకుంటున్నారు. పచ్చని చెట్లు, వికసించిన పూల మధ్య సెల్ఫీలు తీసుకుంటూ చిల్ అవుతున్నారు.

ఉగ్రదాడికి నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ



కొవ్వొత్తుల ర్యాలీలో ఆర్యవైశ్య సంఘ సభ్యులు

పెడన: జమ్మూ–కాశ్మీర్ ఘటనపై ఆర్యవైశ్య స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు పెడనలో శనివారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిల భారత ఆర్యవైశ్యుల పరిరక్షణ సమితి వ్యవస్థాపకుడు డాక్టర్ కొల్లూరి చిన్న మాట్లాడుతూ దేశంలో ఉగ్రవాదాన్ని అణచివేయాలని, మరలా ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కోరారు. కార్యక్రమంలో వరల్డ్ వైడ్ హ్యూమన్ రైట్స్ అండ్ ప్రొటెక్షన్ ఆర్గనైజేషన్ పెడన అధ్యక్షుడు చిట్టూరి పశుపతినాథ్ బాబు, వాసవి క్లబ్ పొట్టి శ్రీరాములు పెడన అధ్యక్షురాలు కొమ్మూరి విజయదుర్గ, ప్రధాన కార్యదర్శి జవాజి మాధవి, ఉపాధ్యక్షురాలు కొల్లూరి పద్మ, పట్టణ శ్రీవాసవి మహిళా మండలి ప్రధాన కార్యదర్శి మామిడి సావిత్రి పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ లైట్లతో ప్రదర్శన

చల్లపల్లి: ఉగ్రవాదుల దాడిలో పెహల్గాంలో మృతి చెందిన వారికి నివాళిగా శనివారం మండల పరిధిలోని వక్కలగడ్డలో సెల్‌ఫోన్ లైట్లతో ప్రదర్శన ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఉగ్రవాదుల దాడి పిరికిపంద చర్యగా అభివర్ణించారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్‌బాబు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు హనుమానుల సురేంద్రనాద్ బెనర్జీ, సీపీఐ గ్రామ శాఖ కార్యదర్శి నక్క శ్రీనివాసరావు, నాయకులు కొల్లూరి శ్రీధర్, అల్లూరి బాబూరావు, మహిళా సమాఖ్య నాయకురాలు హనుమానుల రాణికుమారి, మైనేని కమల పాల్గొన్నారు.

మద్యం అనర్థాలపై అవగాహన

మచిలీపట్నంఅర్బన్: మద్యం అతిగా సేవించడం వల్ల వచ్చే అనర్థాలు, నష్టాలపై కమిటీ అవేర్నెస్ అండ్ రెస్పాన్సివ్ ఎడ్యుకేషన్(కేర్) ఆధ్వర్యంలో స్థానిక వైఎస్సార్ కాలనీలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సూపరింటెండ్ జీ గంగాధరరావు మాట్లాడుతూ అతిగా మద్యం సేవించడం వల్ల వచ్చే ఆరోగ్య సమస్యలను వివరించారు. మద్యం అలవాటు ఉన్నవారి కోసం స్థానిక ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో డీ ఎడిక్షన్ సెంటరును ఏర్పాటు చేశామని తెలిపారు. మద్యానికి బానిసైన యెడల ప్రభుత్వ ఆసుపత్రిలో జాయిన్ చేస్తే పూర్తి ఆరోగ్యవంతులుగా మారే అవకాశం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీవైఈఓ శేఖర్ సింగ్, ఏఈఎస్ భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

భౌతికకాయం, నేత్రదానం

నాగాయలంక: స్థానిక ఏడవ వార్డుకు చెందిన తలశిల శివయ్య(59) అనారోగ్యంతో మృతిచెందగా కుటుంబ సభ్యులు ఆయన భౌతికకాయాన్ని, నేత్రాలను దానం చేశారు. సుదర్శి మానవతా సేవాసంస్థ నిర్వాహకుడు తలశిల రఘుశేఖర్ సహకారంతో విజయవాడకు చెందిన ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్యశాలకు చెందిన డాక్టర్లు వచ్చి శివయ్య నేత్రాల నుంచి కార్నియాను సేకరించారు. భౌతికకాయాన్ని పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలకు అందించారు.

పంచాయతీ కార్యదర్శులకు సత్కారం



శ్రీనివాసరావును సన్మానిస్తున్న సచివాలయ ఉద్యోగులు

ఘంటసాల: ఘంటసాల గ్రామ సచివాలయంలో పనిచేస్తూ పదోన్నతి పొందిన శ్రీనివాసరావు, శివ వెంకట రమణలను గ్రామ సచివాలయం–1, 2 ఉద్యోగులు శనివారం ఘనంగా సన్మానించారు. ఘంటసాల పంచాయతీలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న చెరుకూరి శ్రీనివాసరావు పదోన్నతిపై గ్రేడ్–3 పంచాయతీ కార్యదర్శిగా చల్లపల్లి మండలం యార్లగడ్డ గ్రామ పంచాయతీకి, గ్రేడ్–5 కార్యదర్శిగా పనిచేస్తున్న అనుమకొండ శివవెంకట రమణ గ్రేడ్–4 పంచాయతీ కార్యదర్శిగా మచిలీపట్నం మండలం పోలాటితిప్ప గ్రామా పంచాయతీకి వెళ్లారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి టీ జయలక్ష్మి, వెల్ఫేర్ అసిస్టెంట్లు అనిత, రాజు, డిజిటల్ అసిస్టెంట్లు పావని, ఎల్.పద్మారావు, వీఆర్వో లక్ష్మి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ స్నేహ, వీపీఏలు రేవతి, శ్రీనివాసరావు, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

బ్రహ్మానందపురం పాఠశాలను తరలించొద్దు

అవనిగడ్డ: నాగాయలంకలోని బ్రహ్మానందపురం కాలనీ పాఠశాలను వేరొకచోటుకు తరలించొద్దని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు శీలం నారాయణరావు కోరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ఎస్సీ కాలనీలో ఉన్న ఈ పాఠశాలలో పలు తరగతులు వేరే పాఠశాలకు మార్చడం వల్ల ఇక్కడ చదువుకునే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడతారని పేర్కొన్నారు. అధికారులు ఈ నిర్ణయాన్ని విరమించుకోవాలని కోరారు.

విద్యార్థినులకు సన్మానం



విద్యార్థినులను సన్మానించిన సర్పంచ్ రేవతి, గ్రామస్తులు

మల్లాయి చిట్టూరు(ఘంటసాల): పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో సత్తాచాటిన ఘంటసాల మండలం మల్లాయి చిట్టూరు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థినులు సీహెచ్ సిరి సాయిప్రియ(556), కే శశికళ(507), సీహెచ్ శృతి(506)లను శనివారం సన్మానించారు. హైస్కూల్ హెచ్‌ఎం కృత్తివెంటి మోహనరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ ఆవుల రేవతి, ఎంపీటీసీ సభ్యుడు కుమార్‌రాజా, ఎస్‌ఎంసీ చైర్మన్ కుంపటి రుక్మిణీలు విద్యార్థినులకు ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో నీటి సంఘం ప్రెసిడెంట్ ఆవుల ధర్మవెంకట నరసయ్య, మాజీ ఎంపీటీసీ సభ్యులు వీరమల్లు మేరీకుమారి, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మంగినపూడి బీచ్‌లో హెచ్చరిక బోర్డులు



కోనేరుసెంటర్: మంగినపూడి బీచ్‌లో మెరైన్ పోలీసులు శనివారం హెచ్చరిక బోర్డులను ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా మెరైన్ ఎస్‌ఐ వీజే చంద్రబోస్ మాట్లాడుతూ వాతావరణ మార్పుల కారణంగా మంగినపూడి బీచ్‌లో సుడిగుండాలు, నాలి ఏర్పడిన నేపథ్యంలో స్నానాలకు వచ్చే పర్యాటకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పర్యాటకులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ సిబ్బంది విధులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ పరింకాయల మురళీకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకోండి

మోపిదేవి: అర్హులైన వారు ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ శ్రీవిద్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో అర్హతగల లబ్ధిదారులకు గ్రామాల్లో మూడు సెంట్ల ఇంటి స్థలాన్ని ప్రభుత్వం మంజూరు చేస్తుందని చెప్పారు. ఆయా గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

చల్లపల్లి: ప్రభుత్వం మంజూరు చేసే ఇళ్ల స్థలాల కోసం అర్హులైన లబ్ధిదారుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్నట్లు మండల తహసీల్దార్ డీ వనజాక్షి శనివారం తెలిపారు. అర్హులైన వారు రేషన్‌కార్డు, ఆధార్ కార్డు, ఫొటోలు తీసుకుని గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పెడన: మండలంలో ఇళ్ల స్థలాల కోసం అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని పెడన ఇన్‌ఛార్జి తహసీల్దారు కే అనిల్‌కుమార్ తెలిపారు. పెడన పట్టణంలోని వారికి రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు కేటాయించనున్నట్లు పేర్కొన్నారు.

ఘంటసాల: అర్హులైన అభ్యర్థుల నుంచి ఇళ్ల స్థలాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఘంటసాల తహసీల్దార్ బీ విజయ ప్రసాద్ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ అర్హులైన అభ్యర్థులు సమీపంలోని గ్రామసచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

చిలకలపూడి(మచిలీపట్నం): మచిలీపట్నం రెవిన్యూ డివిజన్ పరిధిలో అర్హత కలిగిన వారు ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆర్డీవో కే స్వాతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలో రెండు సెంట్లు, గ్రామంలో మూడు సెంట్లు ఇళ్లస్థలాలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు.

గూడూరు: మండల పరిధిలో ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకోవాలని గూడూరు తహసీల్దారు డీ రాజ్యలక్ష్మి కోరారు. అర్హులైన వారు తమ గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని వెల్లడించారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం



కృత్తివెన్ను: వైఎస్సార్ సీపీ కుటుంబ సభ్యులందరికీ పార్టీ అండగా ఉంటుందని ఎవరూ అధైర్య పడాల్సిన పనిలేదని ఆ పార్టీ మండల కన్వీనర్ జల్లా భూపతిరాజు అన్నారు. మునిపెడ గ్రామంలోని ఆర్టీసీ కృష్ణా రీజనల్ మాజీ చైర్మన్ పిన్నెంటి మహేష్ నివాసం వద్ద శనివారం వైఎస్సార్ సీపీ మండల, గ్రామ కమిటీల ఎంపికపై సమావేశం నిర్వహించారు. పిన్నెంటి మహేష్‌తో పాటు ఎంపీపీ కూనసాని గరుడప్రసాద్, జెడ్పీటీసీ సభ్యుడు మైల రత్నకుమారిలు కార్యకర్తలనుద్దేశించి మాట్లాడారు. ప్రజాసమస్యలపై వైఎస్సార్ సీపీ తరుపున పోరాటం చేయడానికి కమిటీలు ఎంపిక అనివార్యమన్నారు. సమావేశంలో రైతు సంఘం నాయకులు వీ విశ్వేశ్వరరావు, పట్టపు నాని, వైఎస్ ఎంపీపీ సత్యనారాయణ, పీ సుబ్రహ్మణ్యేంద్రరావు, రాంబాబు, వాసు, ఏడుకొండలు, దీనరాజ్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



విజేతలకు ట్రోఫీని అందజేస్తున్న కలెక్టర్ బాలాజీ

కలెక్టర్ డీకే బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): క్రీడలు శారీరక ధృడత్వానికి, మానసిక ఉల్లాసానికి, సామాజిక అనుబంధాలకు ఎంతగానో తోడ్పడతాయని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన క్రీడల్లో విజేతలకు శనివారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్రీడల వల్ల స్నేహభావం పెంపొందుతుందన్నారు. ఉద్యోగుల పిల్లలు పది, ఇంటర్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించి ఉంటే వారిని సంఘం తరుపున అభినందించాలని సూచించారు. ఉద్యోగులందరికీ వైద్యపరీక్షలు నిర్వహించేందుకు వైద్యశిబిరాలను ఏర్పాటు చేయాలన్నారు. అలాగే ఉద్యోగులందరికీ ఆరోగ్య పథకం గుర్తింపు కార్డులు వచ్చేలా సంఘ నాయకులు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం క్రికెట్‌లో విజేతలైన గుడ్లవల్లేరు, నాగాయలంక మండలాల బృందాలకు ట్రోఫీలు అందజేశారు. వివిధ క్రీడల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఉద్యోగులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డీపీవో జే అరుణ, బొమ్మ శ్రీనివాసరావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కిశోర బాలికలను గుర్తించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో సముద్రవేణి



గూడూరులో కిశోరి వికాసం ఫ్లెక్సీని ప్రదర్శిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

పెడన: కిశోర బాలికలను అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో గుర్తించడానికి ప్రత్యేక టీంలను ఏర్పాటు చేసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో బంటుమిల్లి ఎం సముద్రవేణి అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో మహిళా సంరక్షణ కార్యదర్శులు(సచివాలయాల మహిళా పోలీసులు)తో శనివారం సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వచ్చేనెల రెండు నుంచి జూన్ పదో తేదీ వరకు సమ్మర్ క్యాంపు నిర్వహించాలన్నారు. కిశోర బాలికలను గుర్తించి ప్రతి మంగళవారం, శుక్రవారం వారితో సమావేశం నిర్వహించాలన్నారు. వారి నడవడికను గుర్తించి ప్రవర్తనలో ఏమైనా మార్పులుంటే వాటిని గమనించాలని సూచించారు. బడి ఈడు పిల్లలు బడి మానేసి ఇళ్ల వద్ద ఉన్న వారిని కూడా గుర్తించాలని స్పష్టం చేశారు. కిశోర బాలికలను గుర్తించడానికి కమిటీలో మహిళా పోలీస్, ఏఎన్‌ఎం, ఆశా వర్కరు, అంగన్‌వాడీ టీచరుతో పాటు మరొకరుంటారని తెలిపారు. సమావేశంలో సూపర్ వైజర్లు కల్పవల్లి, సువర్ణ, వెలుగు ఏపీఎం శ్రీదేవి, ఎంపీడీవో కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ విజయ తదితరులు పాల్గొన్నారు.

కృత్తివెన్ను: స్థానిక వెలుగు కార్యాలయంలో కిశోర బాలికలపై సీడీపీవో సముద్రవేణి అవగాహన సమావేశం నిర్వహించారు. కిశోర బాలికలు ఎక్కువగా రక్తహీనతకు గురయ్యే ప్రమాదం ఉందని అందువల్ల ఆ వయస్సులోని వారికి సరైన అవగాహన కల్పించాల్సిన అవసరముందని అన్నారు. సూపర్‌వైజర్ శ్యామలగౌరీ, ఏపీఎం శ్రీనివాస్, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

బాలికా వికాసమే లక్ష్యం

గూడూరు: బాలికా వికాసమే లక్ష్యంగా ప్రభుత్వం కిశోరి వికాస కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ఐసీడీఎస్ మచిలీపట్నం సీడీపీఓ కే గ్లోరి అన్నారు. గూడూరు మండల పరిషత్ కార్యాలయంలో శనివారం కిశోరి వికాసం శిక్షణ తరగతులు జరిగాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ పంచాయతీ స్థాయిలో కిశోరి వికాస టీంలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు జన్న రేవతి, ఉషశ్రీ, ఏపీఎం గోవిందరాజులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మత్స్యకారులకు చెక్కులు అందజేత



కృత్తివెన్నులో మత్స్యకారులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కాగిత



మత్స్యకారులకు చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

కృత్తివెన్ను: చేపల వేట నిషేదంలో భాగంగా మత్స్యకారులకు ఆర్థిక చేయూత చెక్కును స్థానిక ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అందజేశారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 263 బోట్లలోని 1,514 మంది అర్హత కలిగిన కళాసీలకు రూ. 3.2 కోట్ల చెక్కులను అందించినట్లు పేర్కొన్నారు. ఎంపీపీ గరుడప్రసాద్, జెడ్పీటీసీ సభ్యుడు రత్నకుమారి, మార్కెట్ చైర్మన్ తులసీరావు, డీసీ ఎన్‌వీ భాస్కరరావు, ఫిషరీస్ ఏడీఏ నాగబాబు, డీటీ శశికుమార్, ఎఫ్‌డీవో నాగాంజని, అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నాగాయలంక: అవనిగడ్డ నియోజకవర్గంలోని 6,515 మంది మత్స్యకారులకు రూ.13కోట్ల చెక్కులను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ శనివారం పంపిణీ చేశారు. స్థానిక కృష్ణానది తీరంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా రూ.26.15 కోట్ల విలువైన చెక్కులను మత్స్యకారులకు అందించినట్లు తెలిపారు. మత్స్యశాఖ జేడీ ఏ నాగరాజు, టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు, కృష్ణా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవబోయిన వెంకటేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షుడు మండలి వెంకట్రామ్ తదితరులు పాల్గొన్నారు.

లాడ్జిల్లో పోలీసుల తనిఖీలు



మచిలీపట్నంలో లాడ్జిని తనిఖీ చేస్తున్న పోలీసులు

కోనేరుసెంటర్: జిల్లా ఎస్పీ ఆర్ గంగాధరరావు ఆదేశాల మేరకు శనివారం జిల్లాలోని పోలీసు అధికారులు, సిబ్బంది జిల్లా వ్యాప్తంగా ఉన్న లాడ్జిల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. లాడ్జిల నిర్వహణ, లాడ్జిల్లో బసచేసిన వారి వివరాలు, రికార్డుల నిర్వహణ, సీసీ కెమెరాల ఏర్పాటు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనుమానితులు ఎవరైనా లాడ్జిల్లో దిగితే తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. లాడ్జిల్లో అసాంఘిక కార్యకలాపాలకు తావు లేకుండా నిర్వహణ ఉండాలని, చట్ట వ్యతిరేఖ చర్యలకు పాల్పడే వారికి రూంలు అద్దెకు ఇవ్వకూడదని సూచించారు.